

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



ఫ్యాక్షన్ కనుమరుగు

- జిల్లాలో మెరుగైన పోలీసింగ్‌తో నేరాలు 31 శాతం తగ్గుదల
- బలహీనవర్గాలపై దాడుల కేసుల్లో 32 శాతం..
- మహిళలపై అఘాయిత్యాల కేసుల్లో 19 శాతం..
- అత్యాచార కేసుల్లో 26 శాతం తగ్గుదల
- 2024 క్రైం రౌండప్ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



క్రైం రౌండప్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కడప క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫ్యాక్షన్ పూర్తిస్థాయిలో కనుమరుగైందని ఈ ఏడాది ఎక్కడా ఫ్యాక్షన్ గొడవలు జరగలేదని, అలాగే ఇతర నేరాల సంఖ్య కూడా తగ్గిందని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. పోలీసుశాఖ సమర్థవంతంగా పనిచేయడం వల్లనే 2024లో నేరాలు గణనీయంగా తగ్గాయని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి 2024 క్రైం రౌండప్‌పై ఇన్‌చార్జి ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి ఈ ఏడాది జరిగిన నేరాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసింగ్‌లో వినూత్నమైన మార్పులు తీసుకురావడంతోనే జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని, ఇదే ఉత్సాహంతో 2025లో మరింత మెరుగైన పోలీసింగ్‌తో ప్రజలకు ఉత్తమమైన సేవలందిస్తామన్నారు. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే 2024లో అన్నిరకాలైన నేరాలు నియంత్రించడంలో పోలీసులు సఫలీకృత మయ్యారన్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పక్కా ప్రణాళిక ద్వారా ప్రశాంత స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేశారన్నారు.

నేర గణాంకాలు

విజిబుల్ పోలీసింగ్, అసాంఘిక శక్తులపైన నిఘా, అవగాహన కార్యక్రమాలను చేపట్టడంతో పాటు వీడీయాక్టు ప్రయోగం, నాటుసారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపడంలో భాగంగా కన్విక్షన్ బేస్ట్ పోలీసింగ్‌పై దృష్టి సారించామన్నారు. గంజాయి కట్టడి వల్ల 31 శాతం నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో గత ఏడాదితో పోలిస్తే 32 శాతం తగ్గాయని, 2023లో 115 కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో 78 మాత్రమే నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం 7,285 లీటర్లు స్వాధీనం చేసుకున్నామని, 99 కేసుల్లో 130 మందిని అరెస్టు చేశామన్నారు. అలాగే ముమ్మరదాడులు నిర్వహించి 1,609 కేసుల్లో 9,535 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 1,657 మందిని అరెస్టు చేశామన్నారు. నాటుసారాకు సంబంధించి 53 కేసుల్లో 974 లీటర్లను స్వాధీనం చేసుకుని 61 మందిని అరెస్టు చేశామన్నారు.

ప్రాపర్టీ నేరాల కేసుల్లో

ఈ ఏడాది 381 ప్రాపర్టీ నేరాల కేసులు నమోదయ్యాయన్నారు. ఇందులో 188 కేసులు ఛేదించి రూ.6,95,73,004 మొత్తంలో రూ.2,67,76,193 మొత్తాన్ని రికవరీ చేశామన్నారు. ఈ ఏడాది ఒక డెకాయిటీ కానీ, లాభం కోసం హత్య కానీ జరగలేదన్నారు. అలాగే క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా, కోడిపందాలపై ముమ్మరదాడులు చేసి 725 కేసులు నమోదు చేసి 3,429 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.1,25,22,015లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇక ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. జిల్లాలో ఎర్రచందనం అక్రమరవాణా నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. 2024లో 20 మందిని అరెస్టు చేసి 5,772 కిలోల బరువున్న 236 దుంగలను, 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే గంజాయి విక్రయాలపై ముమ్మర దాడులు నిర్వహించినట్లు తెలిపారు. 47 కేసులు నమోదు చేసి 140 మందిని అరెస్టు చేసి 188 కిలోల గంజాయి, 8 వాహనాలు సీజ్ చేశామన్నారు.

తగ్గిన రోడ్డు ప్రమాదాలు..

రోడ్డు భద్రతా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించడం, డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల రోడ్డు ప్రమాద మరణాలు గత ఏడాదిలో పోల్చితే 15శాతం, తీవ్ర రోడ్డు ప్రమాదాలు 15 శాతం తగ్గాయన్నారు. గత ఏడాది మొత్తం 327 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 288 కేసులు నమోదయ్యాయన్నారు. ప్రాణాంతక రోడ్డు ప్రమాదాల్లో 2023లో 371, 2024లో 314 నమోద య్యాయన్నారు. తీవ్ర రోడ్డు ప్రమాదాల్లో 2023లో 243 మంది గాయపడగా, 2024లో 146 మంది గాయపడి 40.31 శాతం తగ్గుదల నమోదైందన్నారు.

ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంటు

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లం ఘించిన వారిపై ఎంవీ చట్టం ప్రకారం 38,335 కేసు లు నమోదు చేసి రూ. 1,20,99,050 జరిమానా విధించామన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు 1,422 నమో దు చేశామన్నారు. డేంజ రస్ డ్రైవింగ్ చేస్తున్న 402 మంది పై కేసులు నమోదు చేశామన్నా రు. అలాగే కిడ్నాప్ కేసుల్లో 36 శాతం తగ్గుదల ఉందన్నారు. 2023లో 17 కిడ్నాప్ కేసులు నమోదు కాగా ఈ ఏడాది 15 కేసులు నమో దయ్యాయన్నారు. మహిళలపై నేరాలకు సంబం ధించి 2023లో 690 కేసులు నమోదు కాగా 2024లో 557 కేసులు నమోదై 19 శాతం తగ్గుదల కనిపించిం దన్నారు. వరకట్న వేధింపుల మరణాలు గత ఏడాది 4 కేసులు, ఈ ఏడాది 3 కేసులు నమోదయ్యాయన్నారు. మహిళల కిడ్నాప్‌నకు సంబంధించి 2023లో 9, 2024లో 6 నమోదయ్యాయన్నారు. 33 శాతం తగ్గాయన్నారు. మహిళలపై దౌర్జన్యం కేసుల్లో 2023లో 177 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 160 కేసులు నమోదయ్యాయన్నారు.

సైబర్ నేరాలు

సైబర్ నేరాలుకు సంబంధించి ఈ ఏడాది 58 కేసులు నమోదయ్యాయన్నారు. 58 కేసుల్లో బాధితులు పోగొట్టుకున్న మొత్తం రూ.7,66,36,205 కాగా రూ. 4,86897 మొత్తాన్ని బాధితులకు తిరిగి అందించామన్నారు. ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్లకు చెందిన 135 బ్యాంకు అకౌంట్లను గుర్తించి అందులో మొత్తం రూ.6,36,58,163ను స్తంభింపజేశామన్నారు. అలాగే రూ.1.84 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. బాధితులు పోగొట్టుకున్న రూ.1,84,50,000 విలువైన 1230 మొబైల్‌ఫోన్లను సైబర్ క్రైం పోలీసుల ఆధ్వర్యంలో రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

హత్య కేసులు

2023లో 51 హత్య కేసులు నమోదు కాగా ఈ ఏడాది 53 కేసులు నమోదయ్యాయన్నారు. ఇవన్నీ అక్రమ సంబంధాలు, క్షణికావేశంలో లేదా చిన్నపాటి కారణాల వల్ల జరిగినవన్నారు. గ్రీవియస్ హర్ట్ కేసుల్లో 12 శాతం తగ్గుదల కనిపించిందన్నారు. పోలీసు శాఖ రెస్పాన్స్ మెరుగుపడడం వల్ల తగాదాలను చాకచక్యంగా హ్యాండిల్ చేశామన్నారు. అత్యాచార కేసుల్లో 26శాతం తగ్గుదల కనిపించిందన్నారు. ఆరు నెలలుగా ప్రత్యేక దృష్టి సారించడం వల్ల మహిళలపై నేరాలు తగ్గాయన్నారు. 2023లో 38 అత్యాచార కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 28 నమోదై 26 శాతం తగ్గాయన్నారు. ఇక చీటింగ్ కేసుల్లో 2023లో 295నమోదు కాగా, ఈ ఏడాది 218 నమోదై 26శాతం తగ్గుదల కనిపించిందన్నారు. అలాగే మిస్సింగ్ కేసుల్లో 2023లో 564 మిస్సింగ్ కేసులు నమోదు కాగా ఈ ఏడాది 556 కేసులు నమోదయ్యాయన్నారు.

కోర్టు మానిటరింగ్ సెల్ కృషి

కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు ద్వారా కేసులపై పోలీసు అధికారులు ప్రత్యేకదృష్టి సారించారన్నారు. దీని ద్వారా కేసుల విచారణ త్వరితిగతిన జరిగి సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నేరస్తులకు శిక్షపడేలా కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో నమోదైన తీవ్రమైన 8 కేసుల్లో 30 మంది ముద్దాయిలకు కోర్టులో సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా పోలీసు అధికారులు సమష్టిగా కృషి చేశారన్నారు. లోక్ అదాలత్‌లో 2024లో 11,484 కేసులను పరిష్కరించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించామన్నారు. అత్యంత ప్రాధాన్యతతో నిర్దేత కాలంలో పరిష్కారానికి జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. ఈ ఏడాది 7,695 ఫిర్యాదులు రాగా, 7,374 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. 2025లో మరింత మెరుగైన సేవలందించి నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని, నిఘా పెంచి నేరాలు కట్టడి చేస్తామన్నారు.

ప్రజా సమస్యలపై అలక్ష్యం వద్దు

- 24 గంటల్లో పరిష్కరించాలి
- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అలక్ష్యం వద్దని, ఎన్నో ఆశలతో బాధితులు సమర్పించే అర్జీలకు 24 గంటల్లో పరిష్కారం చూపాలని లేదంటే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి బాధితులు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యలకు సంబంధించి అర్జీలు సమర్పించారు. వారిని కూర్చో బెట్టి సమస్యలను వింటూ తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. కడప తహసీల్దారు కార్యాలయం పరిధిలో 3200 అర్జీ నెంబరుకు సంబంధించి సచివాలయంలో చలానా కట్టే విషయంలో రిజెక్ట్ చేశారనే సమస్యపై వివరణ కోరి వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వైద్యశాఖకు సంబంధించిన ఫిర్యాదుపై అధికారి వివరణ కోరగా కింది స్థాయి ఉద్యోగి సమాధానం చెప్పడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు జూనియర్ అసిస్టెంట్ ఎందుకు వచ్చావు? గ్రీవెన్స్ సెల్ సమస్యలను మానిటరింగ్ చేస్తారా? వారానికి 5-10 అర్జీలు వస్తాయి. వాటిని కూడా సకాలంలో పరిష్కరించక పోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు కచ్చితంగా చెబుతున్నా ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవన్నారు. తమ సమస్యలు అధికారులు తీర్చుతారని బాధితులు తెల్లవారుజామున 3 గంటలకే లేచి వ్యయప్రయాసాలకు ఓర్చి వస్తారని.. వారి సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవంటూ ఇదే చివరి అవకాశం అంటూ సీరియస్ అయ్యారు. వచ్చే సోమవారం నాటికి 100 శాతం సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, అధికారులు ఆనంద్ నాయక్, నాగేశ్వరరావు, వెంకటపతి, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్‌పై హత్యాయత్నం కేసు

- భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు



నాలుగు రోజుల కిందట పులివెందులలో మాజీ సీఎం జగన్‌ను కలిసిన అల్లం సత్యం

కొండాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప జిల్లా వైసీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్ అల్లం సత్య అలియాస్ అల్లం సత్యనారాయణపై హత్యాయత్నం కేసు నమోదైంది. తాళ్లప్రొద్దుటూరు ఎస్పై హృషికేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన అల్లం సత్య గతంలో సొంతూరిలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ, రాజకీయంగా తిరిగేవాడు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇసుక తోలేవాడు. కాగా.. సార్వత్రిక ఎన్నికల తర్వాత భార్య నవీనతో కలిసి అనంతపురంలో నివాసముంటున్నాడు. ఇతను కొంతకాలంగా భార్యను అదనపు కట్నంకోసం వేధిస్తూ తరుచూ గొడవపడేవాడు. కట్నం తెమ్మని ఆమెను కొడుతూ, తిడుతూ ఉండేవాడు. ఆదివారం ఇద్దరూ స్వగ్రామమైన ఏటూరుకు వచ్చారు. ఈ నేపథ్యంలో భర్త తనను హత్య చేసేందుకు ప్రయత్నించాడంటూ సోమవారం ఉదయం అల్లం సత్య భార్య నవీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్పై పేర్కొన్నారు.

గతంలోనూ కేసులు నమోదు

కొండాపురం మండలం ఏటూరు గ్రామానికి చెందిన అల్లం సత్యపై గతంలో తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయని ఎస్పై హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇతనిపై సస్పెక్ట్ చార్జిషీటు(దొంగతనం కేసుల్లో నిందితుడు) నమోదయిందన్నారు. అలాగే రెండుసార్లు ఇసుక దొంగతనం కేసు నమోదయిదన్నారు. ఇన్సూరెన్స్ కోసం తన ఇన్నోవా వాహనాన్ని తానే కాల్చుకున్నట్లు గతంలో కేసు నమోదయిందని ఎస్పై తెలిపారు.

సీఎస్ విజయానంద్ మనోడే

రాజుపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన విజయానంద్ జిల్లావాసే. ప్రొద్దుటూరు నియోజకవర్గం రాజుపాలెం మండలం అయ్యవారుపల్లె గ్రామం ఆయన స్వస్థలం. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయనను సీఎస్‌గా నియమిస్తూ ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కుటుంబనేపథ్యం

విజయానంద్ పూర్వీకులది కర్నూలు జిల్లా కాగా వీరి తల్లిదండ్రులు లక్ష్మీదేవి, తండ్రి కావేటి నరసింహులు రాజుపాళెం వచ్చి స్థిరపడ్డారు. వీరి తండ్రి పశువైద్యాధికారిగా పనిచేశారు. తల్లి చనిపోయారు. విజయానంద్ అన్న కావేటి హరిప్రసాద్ అనంతపురం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈగా పనిచేస్తున్నారు. సోదరుడు రామ్‌కిరణ్ అమెరికాలో డాక్టర్‌గా స్థిరపడ్డారు. ఇక విజయానంద్ భార్య గృహిణి. కూతురు యామిని దివ్య ఎంబీఏ చదివి అమెరికాలో ఉన్నారు. కుమారుడు ఉజ్వల్ ఎంబీబీఎస్ అండ్ ఎంఎస్ చేశారు. వీరు బెంగళూరులో ఉన్నారు.



విజయానంద్ బ్యానర్ ఏర్పాటు చేసిన అయ్యవారుపల్లె గ్రామస్థులు

విద్యాభ్యాసం

విజయానంద్ 1975-76లో 6వతరగతి దువ్వూ రు మండలంలో చదివారు. కానగూడూరు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూలులో 8వత రగతి వరకు చదివారు. 9, 10 చిత్తూరు జిల్లాలో చదివారు. ప్రొద్దుటూరులోని ఎస్‌సీఎన్‌ఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. బీటెక్, ఎంటెక్ జేఎన్టీయూ అనంతరంలో పూర్తిచేశారు.



గ్రామంలో సంబరాలు

రాజుపాళెం మండలంలోని అయ్యవారుపల్లె ఒక చిన్న గ్రామం. 60 కుటుంబాలు, 250 మంది జనాభా ఉన్న ఈ గ్రామానికి సంబంధించిన ఐఏఎస్ అధికారి విజయానంద్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడంతో ఆ గ్రామంలోని వారంతా సంబరాలు చేసుకున్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఇంజనీరింగ్ అధికారుల సమీక్షలో కలెక్టర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల నిర్మాణ పనులను ఈ ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో డీఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినల్ ఫండ్) ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్బన్, రూరల్ ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణాలను రాజీ లేకుండా నాణ్యతగా పూర్తిచేయాలన్నారు. ఆకాంక్ష జిల్లాల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో ఎంపికైన మండలాల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీపీఓ హజరత్తయ్య, వివిధ శాఖల ఇంజనీరింగ్ అదికారులు పాల్గొన్నారు

ఈవీఎంల గోడౌన్లను పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎంల గోడౌన్లను కలెక్టర్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంల గోడౌన్లను తనిఖీ చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు.

జగన్ జమానా అంతమైంది

- ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమానా అంతమైందని, మదమెక్కిన మదపుటేనుగులు అరాచకాలు చేస్తే చూస్తూ సహించేది లేదని ఏపీ పంచాయతీరాజ్ రాజ్ చాంబర్ అధ్యక్షుడు, సర్పంచుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. చంద్రబాబు తలుచుకుంటే ఒక్క ఆర్డినెన్స్‌తో మీ పదవులు గల్లంతవుతాయన్నారు. ఎంపీడీఓపై దాడికి పాల్పడిన వైసీపీ నేతలపై పీడీయాక్ట్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును సోమవారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీడీవోపై దారుణంగా వైసీపీ ఎంపీపీ కుమారుడితో పాటు ఇతర అసాంఘిక శక్తులు దాడికి పాల్పడ్డాయన్నారు. ఇటువంటి సంఘటనలు తేలికగా తీసుకుంటే ఇవి మళ్లీ పునరావృతం అయ్యే పరిస్థితి ఉందని చెప్పారు. ఉద్యోగులు పనిచేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 80శాతం వైసీపీ వర్గీయులు గెలిచారని చెప్పారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాదన్నారు. ఇది వైసీపీ వాళ్లంతా గుర్తుంచుకొని గౌరవంగా మెలగాలని సూచించారు.



జవహర్‌బాబును పరామర్శిస్తున్న రాజేంద్రప్రసాద్

వర్రా కేసులో పోలీసుల దూకుడు

- గుంటూరులో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



పులివెందుల టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుల విషయంలో అరెస్టు అయిన వర్రా రవీంద్రారెడ్డి కేసుకు సంబంధించి పోలీసులు దూకుడు పెంచారు. ఇందులో భాగంగా గుంటూరుకు చెందిన ముగ్గురిని పులివెందుల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియాలో పెట్టిన అసభ్యకర పోస్టుల విషయమై గత నెల 8న పులివెందుల పోలీసుస్టేషనులో కేసు నమోదు చేశారు. గత నెల 11న వర్రా రవీంద్రరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి అతని నుంచి వాంగ్మూలాన్ని తీసుకున్నారు. ఈ కేసులో దాదాపు వంద మందికి పైగా ఉన్నారు. ఇందులో భాగంగా పలువురికి 41ఏ నోటీసులు ఇచ్చి విచారించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం గుంటూరుకు చెందిన కళ్లెం హరిక్రిష్ణారెడ్డి, ప్రేమ్‌సాగర్, వెంకట్రామిరెడ్డిలను అదుపులోకి తీసుకుని పులివెందులకు తీసుకువస్తున్నారు. వీరిని విచారించి పూర్తి సమాచారం తీసుకున్న తరువాత అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిసింది.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కడప క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జిల్లాలకు చెందిన ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప డీటీసీలో సోమవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మెదటిరోజు ప్రారంభించి పర్యేక్షించారు. జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొనను న్నారు. ప్రతి రోజు 600మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా 1600మీటర్లు, 100మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ నిర్వహించారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రకాశ్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు రానున్న కేంద్ర సహాయమంత్రి

కడప కలెక్టరేట్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జనవరి 1న జిల్లాకు రానున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సోమవారం సమాచారం అందింది. కేంద్రమంత్రి 1వ తేదీ బుధవారం రాత్రి 9-30గంటలకు కడపకు చేరుకుంటారు. 2 వతేదీ అకాంక్ష జిల్లాల అభివృద్ధిలో భాగంగా ఎంపికైన మండలాల్లో పర్యటిస్తారు. తిరిగి 3వ తేదీ శుక్రవారం ఉదయం 10.30గంటలకు కడప విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళతారు.

14 రోజుల్లో నిర్మాణం సాధ్యమేనా...?

- కోర్టు కేసులతో ఆగిన రోడ్డు పనులు
- 20 కిలోమీటర్ల ప్రయాణం నరకం
- నాలుగు నెలలుగా వాహనదారుల ఇక్కట్లు

మదనపల్లె టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె-తిరుపతి మధ్య జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) నాలుగు లేన్ల విస్తరణ నిర్మాణాలు నెమ్మదించాయి. ముఖ్యంగా మదనపల్లె-వాల్మీకిపురం మధ్య నాలుగు కిలోమీటర్ల మేర భూసేకరణ కాకపోవడంతో నాలుగు నెలలుగా జాతీయ రహదారి నిర్మాణం నెమ్మదించింది. దీంతో మదనపల్లె- వాల్మీకిపురం మధ్య 20 కిలోమీటర్లు ప్రయాణికులకు నరకంగా మారింది. దీనికంతటికి నష్టపరిహారం విషయంలో అటు నిర్వాసితులు, ఇటు ఎన్‌హెచ్ అధికారులు కోర్టుల్లో కేసులు వేయడమే కారణంగా తెలుస్తోంది. మదనపల్లె-తిరుపతి మధ్య నాలుగు లేన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఏఐ ద్వారా 118 కిలోమీటర్ల పొడవునా నాలుగు లేన్ల రహదారికి భారతమాల పరియోజన పథకం కింద ఐదేళ్ల క్రితం శ్రీకారం చుట్టింది. జాతీయ రహదారి (ఎన్‌హెచ్-71) నిర్మాణానికి భూసేకరణ, సర్వే తదితర అంశాలపై మూడేళ్ల పాటు అధికారులు మల్లాగుల్లాలు పడ్డారు. ఎట్టకేలకు మదనపల్లె-పీలేరు మధ్య 55.9 కిలోమీటర్లు, పీలేరు-తిరుపతి మధ్య 55.9 కిలోమీటర్ల నిర్మాణాలకు రెండు దశలుగా ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1,577 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతోనే భూసేకరణతో పాటు, రహదారి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.



తట్టివారిపల్లె వద్ద అస్తవ్యస్తంగా వున్న నాలుగురోడ్ల కూడలి



ఆరోగ్యవరం వద్ద నిలిచిపోయిన నాలుగు లేన్ల రహదారి నిర్మాణం



ఆరోగ్యవరం వద్ద నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

పెరిగిన భూసేకరణ వ్యయం

ఎన్‌హెచ్-71 రహదారి నిర్మాణానికి మదనపల్లె-పీలేరు మధ్య 55.9 కిలోమీటర్ల మేర భూసేకరణ చేశారు. 2015 సంవత్సరానికి ముందు జాతీయ రహదారుల భూసేకరణకు హెక్టార్‌కు రూ.80 లక్షలు ఉండగా పెరిగిన భూవిలువల ఆధారంగా ప్రస్తుతం హెక్టార్‌కు రూ.3.60 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ ప్రాజెక్టు వ్యయం గణనీయంగా పెరిగిపోయింది. గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు, పట్టణాల వెలుపల బైపాస్ రోడ్లు వెరసి వందలాది ఎకరాల భూసేకరణ చేశారు. ఒక కిలోమీటర్ భూసేకరణకు రూ.9 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా. ఈ క్రమంలో 55.9 కిలోమీటర్లకు రూ.540 కోట్ల వరకు భూసేకరణకు వ్యయం అయినట్లు తెలుస్తోంది.

రెండేళ్ల గడువులో ఇక మిగిలింది 15 రోజులే

మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి జీఆర్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ టెండర్ దక్కించుకుని 2023 జనవరి 14వ తేదీ పనులు ప్రారంభించింది. 55.9 కిలోమీటర్ల మేర పీలేరు నుంచి ఆరోగ్యవరం వరకు నాలుగు లేన్ల నిర్మాణ పనులు సజావుగానే సాగాయి. కానీ మదనపల్లె మండల ఆరోగ్యవరం నుంచి తట్టివారిపల్లె జంక్షన్ వరకు నాలుగు కిలోమీటర్ల పనులు నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. మదనపల్లె సమీపంలో ఈ భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువగా ఉండటం, భూసేకరణ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువ ఉందని నిర్వాసితులు అభ్యంతరాలు చేశారు. అంతేకాకుండా హైకోర్టుకు వెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆర్బిట్రేషన్ చేసి నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు. కలెక్టర్ ఇచ్చిన ఆర్బిట్రేషన్ ప్రకారం నష్టపరిహారం నిబంధనల ప్రకారం ఎక్కువ ఉందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు హైకోర్టుకు వెళ్లారు. ఇలా ఇరువర్గాలు కోర్టుకు వెళ్లడంతో ఆరోగ్యవరం నుంచి తట్టివారిపల్లె జంక్షన్ వరకు నాలుగు నెలలుగా జాతీయరహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా నిర్మాణ సంస్థ చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలో అంటే 2025 జనవరి 12వ తేదీ లోపు 55.9 కిలోమీటర్ల నిర్మాణం పూర్తి చేయాలని షరతు ఉంది. అంటే ఇక మిగిలింది కేవలం 14 రోజులే. ఇంత తక్కువ సమయంలో నాలుగు కిలోమీటర్ల నాలుగు లేన్ల నిర్మాణం పూర్తి చేయాలంటే అసంభవమే.

వెంకప్పకోట రెవెన్యూ గ్రామాల్లోని సర్వేనెంబర్ 1/1, 1/2, 1/3 పోతబోలు గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 25/2, 90/1ఏ, 1బీ, 92/1ఏ సర్వే నెంబర్లలో ఎన్‌హెచ్-71 వెళుతోంది. ఇక్కడ చదరపు మీటరుకు రూ.3,669 నష్టపరిహారం చెల్లించేలా కలెక్టర్, జేసీలు అవార్డు పాస్ చేశారు. కానీ ఈ సర్వే నెంబర్లలో అంత సొమ్ము పరిహారంగా తాము ఇవ్వలేమని ఎన్‌హెచ్ అధికారులు తేల్చి చెప్పి చిత్తూరు కోర్టులో కేసు వేసినట్లు సమాచారం. అలాగే పోతబోలు గ్రామంలో ఇళ్ళ స్థలాల విలువ బదులు, పొలం భూముల విలువలు వేసి పరిహారం చెల్లిస్తామనడంతో ఇక్కడ ఇళ్ల స్థలాల యజమానులు కోర్టులో కేసులు వేశారు. ఒకవేళ పరిహారం పెంచి బాధితులకు న్యాయం చేసేలా కలెక్టర్ పరిహారం పెంచినా ఎన్‌హెచ్ అధికారులు అంత పరిహారం చెల్లించలేమని మళ్లీ కోర్టులో కేసులు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎంకి పెళ్లి సుబ్బిచావుకు వచ్చిందన్న చందంగా 50 కిలోమీటర్లు మేర వేగంగా ఎన్‌హెచ్ పనులు, బ్రిడ్జిల నిర్మాణం, ఫ్లైఓవర్, రైలు ఓవర్ బ్రిడ్జిలు పూర్తి అయినా, నాలుగు కిలోమీటర్లలో మాత్రం పనులు నిలిచిపోయాయి.

కోర్టు కేసుల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



తట్టివారిపల్లె జంక్షన్ నుంచి ఆరోగ్యవరం వరకు భూసేకరణకు అడ్డంకిగా మారిన కోర్టు కేసుల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాము. భూములు కోల్పోతున్న వారితో ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపాము. వారికి న్యాయమైన పరిహారం అందించేందుకు కృషి చేసేందుకు ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అవుతాయని ఆశిస్తున్నాము.

- మేఘస్వరూప్, సబ్‌కలెక్టర్, మదనపల్లె.

20 కిలోమీటర్ల ప్రయాణానికి 45 నిమిషాలు

మదనపల్లె-వాల్మీకిపురం మధ్య 20 కిలోమీటర్ల ప్రయాణానికి డబుల్ రోడ్డులో అయితే 30 నిమిషాల సమయం పడుతుంది. కానీ ఇప్పుడు 20 కిలోమీటర్ల ప్రయాణం 45 నుంచి 50 నిమిషాలు పడుతోంది. తట్టివారిపల్లె జంక్షన్ నుంచి ఆరోగ్యవరం దిగువ వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. ఈ నాలుగు కిలోమీటర్ల పరిధిలో 12 స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఇదిలా ఉంటే మిగిలిన 16 కిలోమీటర్ల మేర ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు పెట్రోల్ బంకుల వద్ద, ఇతర ప్రదేశాల్లో 10 చోట్ల స్పీడ్‌బ్రేకర్లు వేశారు. మొత్తం మీద 20 కిలోమీటర్లకు 28 స్పీడ్‌బ్రేకర్లు దాటుకుని వెళ్లాలంటే వాహనదారులు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది మదనపల్లె నుంచి తిరుపతి వెళ్లాలంటే భయపడి చిత్తూరు మీదుగా తిరుపతి వెళుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ప్రజలను సమన్వయం చేసుకుని రహదారి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

- ఒకరికి కత్తిపోట్లు.. టాటూ షాపు దహనం
- ఇద్దరిపై దాడులు

రాయచోటి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ చోటా నాయకుడి అనుచరులుగా చెప్పుకునే ఈ బ్యాచ్ అరాచకం సృష్టించింది. బాధితుల కథనం మేరకు.. సోమవారం సాయంత్రం ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న అక్క కూతురిని ఇంటికి తీసుకెళ్లేందుకు రాహుల్, కృష్ణకుమార్ నాయక్ ఇద్దరు వెళ్లారు. ఒకసారిగా సదరు నాయకుడి అనుచరులుగా చెప్పుకునే ఓ పది మంది వీళ్లపై విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం ఇద్దరినీ తమతో పాటు తీసుకెళ్లిపోయారు. వాళ్ల నుంచి రాహుల్ ఎలాగో తప్పించుకుని బయటపడ్డాడు. తమతో పాటే కృష్ణకుమార్‌నాయక్‌ను తీసుకెళ్లిపోయారు. ఈ విషయాన్ని రాహుల్ తన బంధువులు, స్నేహితులకు తెలియజేశాడు. కృష్ణకుమార్‌నాయక్ కనిపించకుండా పోయిన విషయాన్ని తెలుసుకున్న అతడి స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సాయంత్రం 6 గంటల సమయంలో గున్నికుంట్ల ఇనాత్‌ఖాన్ చెరువు సమీపంలో కృష్ణకుమార్‌నాయక్‌ను కొడుతున్న విషయం అతడి స్నేహితులకు చెప్పారు. దీంతో అతడిని విడిపించుకు రావడానికి కొందరు వెళ్లారు. వాళ్ల మీద కూడా దాడి చేసి విజయ్ అనే యువకుడి చేతిపై కత్తితో పొడిచారు. దీంతో హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. వీళ్లను పోలీసులు విచారిస్తుండగానే గంజాయి బ్యాచ్ మరోసారి రెచ్చిపోయింది. చేతుల్లో దెబ్బలు తిన్న ఓ యువకుడు కొత్తపేటలో టాటూ షాపు నిర్వహించుకుంటున్నాడు. ఈ షాపను గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి దహనం చేశారు. షాపు పూర్తిగా కాలిపోయింది. దీంతో ఒకసారిగా పట్టణంలో భయానక వాతావరణం నెలకొంది. అగ్నిమాపక వాహనం వచ్చి మిగిలిన షాపులకు మంటలు వ్యాపించకుండా నిరోధించారు. దీంతో వెంటనే ఎస్ఐలు నరసింహారెడ్డి, జహీర్‌లు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే ఆ నాయకుడి అనుచరుల పేరుతో కొంతమంది యువకులు గత కొన్ని నెలలుగా పట్టణంలో అరాచకాలు సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గంజాయి తాగడం, ప్రతిరోజూ ఎవరో ఒకరిని కొట్టడమే పనిగా పెట్టుకున్నారని బాధితులు వాపోతున్నారు. వీళ్ల దాడికి గురైన పలువురు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా భయపడుతున్నారని సమాచారం. ఇటువంటి అరాచక శక్తులపైన పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



కాలిపోతున్న టాటూ షాపు

విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ప్రతినిధులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో విద్యా, పరిశోధన, సాంస్కృతిక రంగాలలో సహకారాన్ని పెంపొందించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి వెళ్లారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా ఫైన్ ఆర్ట్స్ సాంస్కృతిక రంగాలలో ఇరు సంస్థల నైపుణ్యాలను పరస్పరం వినియోగించుకునేందుకు వీలు కలుగనుందన్నారు. ఈ ఒప్పందం కింద ఇరు విశ్వవిద్యాలయాలు కలిసి పలు కార్యక్రమాలను చేపట్టనున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఫైన్ ఆర్ట్స్ సంస్కృతిని పరిరక్షించడం, ప్రోత్సహించడం అనివార్యమన్నారు. ఈ ఒప్పందం రాబోయే తరం కళాకారులు, విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడనుంది. రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు రాకూడదు

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
- డిప్యూటీ సీఎం చొరవతోనే దివ్యాంగులకు స్కూటర్ల పంపిణీ : కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు రాకూడదని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, వర్చువల్‌గా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా ఉచిత స్కూటర్లను పంపిణీ చేశారు. దివ్యాంగులైన లక్కిరెడ్డిపల్లె మండలం కాపుపల్లి గ్రామానికి చెందిన కట్ట ఆదినారాయణ, వేములవాండ్లపల్లెకు కాల్వ చంద్రశేఖర్‌లకు రెండు లక్షల రూపాయలతో కొన్న 2 రెట్రోఫిటెడ్ మోటార్ స్కూటర్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంతో చొరవ చూపి తన సొంత బడ్జెట్ నుంచి రెండు లక్షలు కేటాయించి వాహనాలను కొని లబ్ధిదారులకు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఇది వారికి చాలా చిన్న ఉపశమనమే అయినప్పటికీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి తన పెద్ద మనసును చాటుకోవడం ద్వారానే ఇంత మంచి కార్యక్రమాన్ని చేయగలిగామని తెలిపారు. శనివారం రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆదినారాయణ, చంద్రశేఖర్‌లు ఉపముఖ్యమంత్రిని కలిసిన సందర్భంగా ఆయన ఆదేశాల మేరకు రెండు స్కూటర్లను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, విభిన్న ప్రతిభావంతులశాఖల జిల్లా అధికారి కృష్ణకిశోర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణీలో కలెక్టర్ శ్రీధర్, తదితరులు

వేగవంతంగా బ్రహ్మోత్సవాల పనులు

- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు పనులు వేగవంతం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అన్నారు. సోమవారం దేవునికడప బ్రహ్మోత్సవాల్లో భాగంగా కడపకు వెళుతూ కోదండరామాలయం చేరుకుని రాబోయే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. బ్రహ్మోత్సవాలకు మరో మూడు నెలలకు మాత్రమే సమయం ఉండడంతో భక్తులకు అవసరమయ్యే పనులను వేగవంతం చేయాలని వీటితో పాటు రామాలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఆయన సమీక్షించారు. రామాలయం వద్ద గ్రీనరీని పెంచాలని, వాటి కోసం ప్రత్యేక ప్లాంటేషన్‌ను చేపట్టాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. రామాలయం చుట్టూ ఉన్న పార్కులను సుందరీకరణ చేపట్టాలని తెలిపారు. వీటితో పాటు భక్తులకు సేద తీరేందుకు పార్కుల్లో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కల్యాణవేదిక వద్ద పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల్యాణోత్సవానికి హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక ప్రణాళికలతో పనులు చేపట్టాలని సూచించారు. ప్రసాదాలు పంపిణీ, తలంబ్రాల పంపిణీ వంటివాటిపై ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేసి అందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ సుమతి, డీఈ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో శ్రీనివాసులు, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసులు, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పనులపై అధికారులతో చర్చిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

శాంతిభద్రతలను పరిరక్షించాం

- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాం
- కోటి 87 లక్షల విలువ చేసే 1252 మొబైల్ ఫోన్‌ల రికవరీ
- 8878 సీసీ కెమెరాలతో జిల్లాను నిఘా నేత్రంగా తీర్చిదిద్దాం
- మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేసిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను పటిష్టపరిచి ప్రజల సహకారంతో శాంతిభద్రతలను పరిరక్షించామని తెలిపారు. మహిళా పోలీసులతో తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ మహిళలు, బాలికల్లో చట్టపరంగా చైతన్యపర్చడమే కాకుండా ప్రజలు సైబర్ క్రైం బారిన పడకుండా అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించామన్నారు. ఈ ఏడాదిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ఆరుగురిని జిల్లా బహిష్కరణ చేశామన్నారు. సైబర్ క్రైం ద్వారా నష్టపోయిన బాధితులకు రూ.2 కోట్ల 47 లక్షల 57 వేల 540 రికవరీ చేసి అప్పగించామని చెప్పారు. జిల్లాలో నేరాల కట్టడి కోసం జిల్లా వ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో 8878 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక కృషి

జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను పటిష్టపరిచి శాంతిభద్రతలను పకడ్బందీగా అమలు చేయడమే కాకుండా విజిబుల్, ప్రివెంటివ్ పోలీసింగ్‌తో శాంతిభద్రతల పరంగా సున్నితమైన అంశాలను ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి సామరస్యంగా పరిష్కరించామన్నారు. 2024లో రూ.5 కోట్ల 19 లక్షల 68 వేల 696లు ప్రాపర్టీ లాస్ జరగగా అందులో నుంచి రూ.2 కోట్ల 12 లక్షల 36 వేల 772లు రికవరీ చేశామన్నారు. హత్యలు, అత్యాచారాలు, హత్యాప్రయత్నాలు, దొంగతనాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసులు, ఛీటింగ్ కేసులు, సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు తదితర భూసమస్యల కేసులు 2023 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 4289 కేసు నమోదు దాకా 2024లో 3616 కేసులు నమోదయ్యాయన్నారు. 2024లో రోడ్డు ప్రమాదాలు 643 జరగగా అందులో 349 మంది మృతి చెందగా 814 మంది గాయపడ్డారన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కింద 1470 కేసు నమోదు కాగా 43,606 మందికి రూ.కోటి 13 లక్షల 5 వేల 045లో జరిమానా విధించామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు 7 కేసులు నమోదు చేసి 54 మంది నిందితులను గుర్తించడంతో పాటు అందులో 25 మంది ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలు, మేస్త్రీలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.56 లక్షల 63 వేల 246 విలువ గల 2,451 కేజీల బరువు గల 83 ఎర్రచందనం దుంగలతో పాటు 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసుల్లో...

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 800 గ్రాముల బంగారు నగలతో పాటు 17 కేజీల వెండి, 86 లక్షల నగదు రికవరీ చేశామన్నారు. అలాగే నుండుపల్లె, మదనపల్లె, ముదివేడు ప్రాంతాల్లో మహిళలను చంపిన, అత్యాచారం కేసుల్లో నలుగురికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన మొబైల్ ఫోన్ మిస్సింగ్ కేసుల్లో రూ.ఒక కోటి 87 లక్షల 80 వేల విలువ గల 1252 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా జూదం ఆడుతున్న 2537 మందిపై 418 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 63 లక్షల 47 వేల 664 నగదును 43 సెల్‌ఫోన్లను, 100 వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కోడిపందెం ఆడుతున్న 560 మందిని అరెస్టు చేసి 89 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 9,74,900 నగదును, 16 సెల్‌ఫోన్లు, 257 కోడిపుంజులు, 77 కోడికత్తులు, 109 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే మట్కా ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసి 6 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.53,230లు నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అంతేగాక ఆయుధాల నిరోధక చట్టం కింద 19 మందిని అరెస్టు చేసి వారిపై 13 కేసులు నమోదు చేసి అక్రమంగా కలిగి ఉన్న 15 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పేలుడు పదార్థాల నిరోధక చట్టం కింద 9 మందిని అరెస్టు చేసి రెండు కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 13 బాంబులు, జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బియ్యం అక్రమ రవాణా కింద 40 మందిని అరెస్టు చేసి 24 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 2,06,572 కిలోల బరువు గల 4578 బియ్యం బస్తాలు 15 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నాటుసారా తయారీ విక్రయాల కింద 114 కేసులు నమోదు చేసి 1168 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 5055 లీటర్ల నాటుసారాతో పాటు 5834 లీటర్ల అక్రమ మద్యం, 13,475 లీటర్ల నాటుసారా ఊటను నాశనం చేయడంతో పాటు 53 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అలాగే మాదకద్రవ్యాల నిర్మూలన చట్టం కింద 126 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 258 కేజీల గంజాయితో పాటు 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అంతేగాక ఇసుక అక్రమ రవాణా విషయంలో 214 మందిపై 136 కేసులు నమోదు చేసి 143 ట్రాక్టర్లు, 17 లారీలు, 7 జేసీబీలు సీజ్ చేసి వెయ్యి టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే గల్ఫ్‌దేశాల్లో ఇబ్బందులు పడుతున్న జిల్లా వాసులను స్వదేశానికి తీసుకురావడానికి కృషి చేశామన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులతో పాటు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి 2023 కన్నా 2024 సంవత్సరంలో నేరాలను అదుపు చేయడంలో కీలకపాత్ర పోషించే 15 శాతం తగ్గించేందుకు కృషి చేశామని, రాబోయే 2025 సంవత్సరంలో కూడా ఇదే అంకితభావంతో పనిచేసే నేరాలను కట్టడి చేస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రితో పాటు రాయచోటి, రాజంపేట, మదనపల్లె డీఎస్పీలు కృష్ణమోహన్, సుధాకర్, కొండయ్యనాయుడు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, చిత్రంలో పోలీసు అధికారులు

పనులు వేగవంతం చేయాలి

● సీజీఎం అయూబ్‌ఖాన్



మాట్లాడుతున్న చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్‌ఖాన్

కడప నాగరాజుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్‌ఎస్ పథకం కింద జరిగే పనులు వేగవంతం చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ అయూబ్‌ఖాన్ కాంట్రాక్టర్లకు సూచించారు. కడపలోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో జిల్లాలోని కాంట్రాక్టర్లతో ఎస్ఈ ఎస్.రమణ సమీక్ష సమావేశం నిర్వహించారు. చీఫ్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పనుల నాణ్యతలో రాజీపడకుండా పనులు వేగవంతం చేసి గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో తమవంతుగా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి దేశాభివృద్ధికి చిహ్నాలని గుర్తుచేశారు. ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా పల్లెలను పట్టణాలతో ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాల కల్పనలో అత్యంత ప్రధానమైన త్రిఫేజ్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. పల్లెలోని సింగిల్ ఫేజ్ కేబుల్ లైన్ల స్థానంలో త్రిఫేజ్ 5 వైర్ల ఎల్టీ లైన్‌ను కండక్టర్ ద్వారా ఏర్పాటు చేసి, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి పల్లెల్లో ఉండే విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలియజేశారు. ఈ ప్రక్రియ ఎంత త్వరగా పూర్తయితే అంత త్వరగా గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేయవచ్చని తెలిపారు. తద్వారా పట్టణాలకు దీటుగా పరిశ్రమల ఏర్పాటుకు సులభతరం అవుతుందని తెలిపారు. కొంతమంది కాంట్రాక్టర్లు కొత్త లైన్లు వేసేందుకు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని, పొలం గట్ల వెంబడి తీసుకెళ్లాలని సూచించారు. ఈ మహత్తర కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి, ప్రత్యేకంగా గృహాలకు విద్యుత్ వ్యవస్థ వేర్వేరుగా ఏర్పడుతుంది. తద్వారా 24 గంటల త్రిఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ప్రజలు కూడా గ్రామీణ ప్రాంత అభివృద్ధికి తమవంతుగా కొత్తలైన్లు వేయుటకు ఆటంకాలు కలిగించకుండా తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఈఈలు నాగరాజు, శ్రీనివాసులు, డీఈఈలు, ఏఈఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు



ఆత్మహత్యకు పాల్పడ్డ పల్లవి

పులివెందులటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణ పరిధిలోని సమతానగర్, భాకరాపురం వీధిలో నివాసం ఉంటున్న మాలేపాటి పల్లవి (26)కు 8 ఏళ్ల కిందట సునీల్ కుమార్‌రెడ్డితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా భర్త హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ సంవత్సరం క్రితం కంపెనీ మూసివేసినందున ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తన పిల్లలను స్కూలు వద్ద వదిలిపెట్టి ఇంటికి తిరిగి వచ్చేసరికి బెడ్‌రూముకు లాక్ చేసుకొని ఉంది. భర్త, బంధువులు ఎంత పిలిచినా పలకకపోవడంతో డోరు పగులగొట్టి చూడగా ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు బంధువులు పులివెందుల అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీని సద్వినియోగం చేసుకోండి

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



ప్రథమ విజేతకు బహుమతిని అందిస్తున్న గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ ద్వారా మీ వస్తువులను నేరుగా మీ ఇళ్ల వద్దకే చేరవేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి సూచించారు. ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను పురస్కరించుకుని (ఈ నెల 20 నుంచి వచ్చే జనవరి 19 వరకు) డోర్ డెలివరీలను ప్రోత్సహించడంలో భాగంగా డోర్ డెలివరీ బుక్ చేయు వినియోగదారులకు ప్రోత్సాహక బహుమతులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి ఈనెల 30, జనవరి 6, 13, 19 తేదీలలో ఇవ్వనున్నారు. అందులో భాగంగా మొదటి విడతగా సోమవారం స్థానిక కడప కార్గో కార్యాలయ ఆవరణంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో మొదటి విజేతగా కిరణ్‌కుమార్ (కడప), ద్వితీయ విజేతగా (కడప) తృతీయ విజేతగా ఎంపీఎల్ ఏజెన్సీ (కడప) నిలిచారు. విజేతలకు ఆర్ఎం చేతులమీదుగా బహుమతి ప్రదానం గావించారు. కార్యక్రమంలో కార్గో ఏటీఎం కమర్షియల్ జనార్థన్, కడప డిపో మేనేజర్ ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను తక్కువ చేస్తే సహించేది లేదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడితే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య హెచ్చరించారు. పార్లమెంటులో అమిత్‌షా అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు, లౌకిక ప్రజాస్వామిక సంస్థల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా కడప నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ భారతదేశం భిన్న సంస్కృతుల కలయికతో ఉందని, అనేక భాషలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఉన్నాయ, అటువంటి వైవిధ్యం కలిగిన దేశానికి ఒక రాజ్యాంగం రచించి అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి అంబేడ్కర్‌ను అమిత్‌షా తక్కువ చేసి మాట్లాడడం ప్రజలు క్షమించరన్నారు. అమిత్‌షాను మంత్రి మండలి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ హిందుత్వం ముసుగులో దేశ సంపదను ప్రభుత్వ రంగ సంస్థలు ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అదానీ, అంబానీలకు ఇతర కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ హిందువుల ప్రయోజనాలు కాపాడలేదని, హిందుత్వం ముసుగులో వ్యాపారం చేస్తోందని అటువంటి బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. అమిత్‌షాను మంత్రి మండలి నుంచి తొలగించని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రైలు ఢీకొని మహిళ మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన స్వాతి

కమలాపురంరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని రైల్వేగేటు వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని స్వాతి (25) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మృతురాలు చెవిలో బ్లూటూత్ పెట్టుకొని ఫోన్ మాట్లాడుతూ వచ్చే రైలును గమనించకుండా ట్రాక్ దాటే ప్రయత్నం చేసిందని, ఈ క్రమంలో రైలు ఢీకొనిందని తెలిపారు. కాగా ఈమె కొప్పర్తి పారిశ్రామికవాడలో సీసీ కెమెరాల విభాగంలో పనిచేస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతు కుటుంబీకులను పరామర్శించిన అధికారులు



నాగేంద్ర కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మేనేజరు రమణ, సిబ్బంది

సింహాద్రిపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల దుద్దెకుంట్ల గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న నాగేంద్ర తల్లిని పలువురు అధికారులు సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు సింహాద్రిపురం ప్రకృతి వ్యవసాయం సిబ్బంది.. నాగేంద్ర తల్లిని పరామర్శించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసినట్లయితే పెట్టుబడి ఖర్చు తగ్గి రైతుల ఆత్మహత్య శాతం తగ్గే అవకాశం ఉంటుందని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మేనేజరు ఐవీ రమణ పేర్కొన్నారు. అలాగే మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి నాగేంద్ర కుటుంబీకులను పరామర్శించి, భూ పత్రాలను పరిశీలించారు. అనంతరం ఏఓ వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి నాగేంద్ర పొలాన్ని పరిశీలించారు.

డ్వాక్రా మహిళ ఆత్మహత్యాయత్నం

● సంఘ సభ్యుల వేధింపులు, పేరును తొలగించారని మనస్థాపం



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవి

రైల్వేకోడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘానికి చెందిన 2వ లీడర్ పేరును సంఘం నుంచి తొలగించారని బాధితురాలు సోమవారం వెలుగు కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ పరిధిలో ఉన్న దళితవాడకు చెందిన బైరాగిల దేవి అనే డ్వాక్రా మహిళ లక్ష్మీ నరసింహ డ్వాక్రా గ్రూపులో 2వ లీడర్‌గా ఉంది. ఆమె ఆలస్యంగా డబ్బులు చెల్లిస్తోందని, తీసుకున్న రుణం సక్రమంగా ప్రతి నెలా చెల్లించడం లేదని ఆమెను గ్రూపు నుంచి తొలగించాలని సుమారు నాలుగు నెలల నుంచి సంఘంలోని కొందరు ప్రయత్నిస్తున్నారని బాధితురాలు తెలిపింది. తాను రూ.34,900 బాకీ ఉండగా దానిని బయట వడ్డీకి డబ్బు తెచ్చి చెల్లించానని, తాను తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లిస్తున్నానని తెలిపింది. కొత్తవారిని ఇద్దరిని సంఘంలోకి తీసుకోవాలని సంఘం సభ్యులు చూస్తున్నారని, తాను 30 ఏళ్లుగా సంఘంలో ఉంటున్నానని చెప్పినా సంఘం సభ్యులు పట్టించుకోవడం లేదని, తొలగింపు వ్యవహారం అధికారులకు తెలియకుండా యానిమేటర్ చేస్తున్నారని బాధితురాలు తెలిపింది. తాను వితంతువునని, తనకు ఒక బుద్ధిమాంద్యం గల కుమార్తె ఉందని కూలీనాలీ చేసుకుని జీవిస్తున్నానని, భర్త లేకపోయినా అల్లుడు నాగరాజు సాయంతో జీవనం గడుపుతున్నామని బాధితురాలు తెలిపింది. సంఘంలో తన పేరు తొలగిస్తున్నారని, తనకు రుణం ఇవ్వమని చెప్పినందుకు తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపింది. వెలుగు కార్యాలయంలో పురుగుల మందు తాగిన మహిళ అపస్మార స్థితికి చేరుకోవడంతో రైల్వేకోడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.

మొత్తం డబ్బులు చెల్లించింది

డ్వాక్రా మహిళ దేవి తాను తీసుకున్న రుణానికి సంబంధించిన డబ్బులు చెల్లించిందని, ఆమెను సంఘంలో ఉంచుకోవాలని సంఘ సభ్యులకు చెప్పినట్లు రైల్వేకోడూరు వెలుగు ఏపీవో వసుంధర తెలిపారు. గ్రామంలో జరిగిన విషయాలు తనకు తెలియదని, దీనిపై సమగ్రంగా విచారణ చేస్తామని వివరించారు.

ఎస్‌హెచ్‌జీ ద్వారా ఉత్పత్తుల ప్రదర్శన



ఉత్పత్తులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం కడప నగరంలో మెప్మా పీడీ వై.సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ మార్కెట్ ద్వారా పట్టణ పరిధిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే క్రమంలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రదర్శనల ద్వారా వినియోగదారులకు స్థానిక ఉత్పత్తులను అందించడంతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధులు కల్పించబడతాయన్నారు. అదేవిధంగా వివిధ రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఒకయాప్‌ను రూపొందించి అందులో తమకు అవసరమైన సేవలను ఇంట్లో నుంచే బుక్ చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, వాషింగ్ మిషన్, ఏసీ, గ్రీజర్, వాటర్ ఫిల్టర్ లాంటి పరికరాల మరమ్మత్తులతో పాటు బ్యూటీషియన్, మెన్ సెలూన్ లాంటి సేవలను ఈ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. ఈ సేవలకు చార్జీలను ముందుగానే నిర్ణయిస్తామని తెలిపారు. దీని ద్వారా వినియోగదారులు అధిక మొత్తంలో ఖర్చుచేసే పరిస్థితి తప్పుతుందన్నారు. అదేవిధంగా వివిధ రంగాల పనులు చేసే వారికి ఉపాధి అవకాశాలు కల్పించే పరిస్థితి కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్ నాగరాజు, సీఎంఎం రాజేశ్వరి, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వరిగడ్డి దగ్ధం

మైదుకూరురూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతినగర్‌లో వరిగడ్డితో వెళుతున్న ట్రాక్టర్‌కు షార్ట్ సర్క్యూట్ తగిలి కొంత మేరకు వరిగడ్డి కాలిబూడిదైంది. సోమవారం చాపాడు మండలం శ్రీరాములపేటకు చెందిన కుచ్చుపాపా గంగులయ్య జ్యోతినగర్‌లో నివసిస్తున్న తన అల్లుడుకు వరిగడ్డిని ఇవ్వాలని శ్రీరాములపేట నుంచి జ్యోతినగర్‌కు తీసు కెళ్తున్నాడు. కాగా జ్యోతినగర్ వద్ద వరిగడ్డికి కరెంటు వైర్లు తగలి నిప్పులు రావడంతో అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే వరి చెత్తను కిందకు పడేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ యజమాని గంగులయ్యకు స్వల్పగాయాలయ్యాయి.

ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ మహమ్మద్ రఫీపై దాడి

● ఆరుగురిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ మహ్మద్‌రఫీపై కొందరు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి రూరల్ పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈ దాడి ఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసుస్టేషన్ ఎస్ఐ ధనుంజయ.. లింగమయ్య మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..

ఆదివారం రాత్రి 7 గంటలకు జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని చిన్నశెట్టిపల్లె క్రాస్ వద్ద బైక-కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రాజుపాళెంకు చెందిన లింగమయ్య, ప్రొద్దుటూరుకు చెందిన హర్ష అనే ఇద్దరు యువకులు కిందపడి గాయపడ్డారు. ప్రమాద ఘటనపై రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీకి సమాచారం రాగా యువకులను ఇద్దరిని ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం కడప కొండాయపల్లి చిన్నచౌక్‌కు చెందిన కారు డ్రైవరు కడలయ్యగారి వెంకటరెడ్డి (24)ని పోలీసు స్టేషన్లో విచారించి 35 (3) బీఎన్ఎస్ఎస్ కింద నోటీసులు ఇచ్చి పంపారు. ఇదిలా వుండగా ప్రమాదంలో గాయపడిన లింగమయ్యకు సంబంధించి రాజుపాళెంకు చెందిన వ్యక్తులు సంఘటన విషయం తెలుసుకొని రూరల్ పోలీసు స్టేషనుకు వచ్చి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవరును ఎందుకు వదిలేశారని డ్యూటీలో వున్న కానిస్టేబుల్స్ రమేష్, చిన్ననాగన్న, ఏఎస్ఐ జాఫర్ హుస్సేన్‌పై గట్టిగా అరుపులు అరిచి కేకలు వేశారు. ఈ విషయం రూరల్ ఎస్ఐ రఫీకి ఫోన్‌లో డ్యూటీలో వున్న పోలీసులు సమాచారం అందించగా ఆయన మఫ్టీలో స్టేషనుకు వచ్చారు. కాగా ఎస్ఐ రఫీతో కూడా లింగమయ్య సోదరుడు పెద్ద లింగమయ్య మరికొందరు వాగ్వాదానికి దిగారు. చట్టప్రకారం కారు డ్రైవరును నోటీసులు ఇచ్చి పంపామన్నా కూడా వినకుండా 'ఏందిరా నీతో మాట్లాడేది' అని ఎస్ఐ ఎడమ చెంపపై చేతితో కొట్టారు. దీంతో ఎస్ఐపై దాడి చేయడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించినందుకు లింగమయ్య, శివ, రాము, ప్రవీణ్, మేరీశాంతి మరి కొందరిపై టూటౌన్ పోలీసు స్టేషన్లో 364/24 అండర్ సెక్షన్ 121 (1) 132 రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ చట్టం ప్రకారం ఎస్ఐ ధనుంజయ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిధులివ్వండి మహాప్రభో...



కూలిపోయిన ప్రహరీకి ఇటుకలు పేర్చిన దృశ్యం

చెన్నూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నమాచుపల్లె ఉన్నత పాఠశాలలో వంటగది, ప్రహరీ నిర్మాణం నిధుల్లేక నిలిచిపోయిందని, వెంటనే నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవించారు. నిధులు తక్కువగా ఉండటంతో వంట గది నిర్మించి సిమెంటు పూత మాత్రమే వేశారని, తలుపు, కిటికి గ్రిల్ ఏర్పాటు చేయకపోవడంతో వంట చేసే సమయంలో కోతులు వంట గదిలోకి చొరబడుతున్నాయని తెలిపారు. దీంతో వంట చేసే వారు ఇబ్బంది పడుతున్నారన్నారు.గదికి తలుపు, కిటికి లేకపోవడంతో అందులో వంట సామగ్రి, ఆహార పదార్థాలకు రక్షణ లేదన్నారు. అంతేకాక గతంలో ప్రధాన గేటు గోడ కొంత కూలిపోగా తాత్కాలికంగా ఇటుక దిమ్మెలు పెట్టారని, ఆ దిమ్మెలు అప్పుడప్పుడూ కిందపడుతున్నాయని, అవి విద్యార్థుల మీద పడి ప్రమాదాలు జరుగుతాయేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



చిన్నమాచుపల్లె ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వంట గది నిర్మాణం

త్వరలో నిధులు వస్తాయి



చిన్నమాచుపల్లె ఉన్నతపాఠశాలలో వంటగది, ప్రహరీని బాగు చేసేందుకు నిధులు త్వరలో వస్తాయి. ఉన్నతాధికారులకు సమస్య తెలిపాం. వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేస్తామన్నారు. నిధులు రాగానే వంట గది, ప్రహరీ పూర్తి చేస్తాం. **- గంగిరెడ్డి, ఎంఈవో, చెన్నూరు**

రోడ్లపై అల్లర్లకు పాల్పడితే తాట తీస్తాం

- రాత్రి 10 నుంచి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 31వ రాత్రి రోడ్లపై అల్లర్లకు పాల్పడితే తాట తీస్తామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడి ఆదేశాల మేరకు సోమవారం ఆయన హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 వరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. 31న రాత్రి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రిళ్లు ఎవరైనా రోడ్లపై తిరుగుతూ అల్లర్లకు పాల్పడితే తాట తీస్తామని హెచ్చరించారు. న్యూయర్ వేడుకలు కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలే తప్ప రోడ్లపై మద్యంతాగి ప్రవర్తిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. రాత్రి 10 నుంచి 5 వరకు ప్రతి పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో అన్ని ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సుమారు 20 మంది స్పెషల్‌టీం, మొబైల్ టీంగా ఏర్పడి స్పీడ్ లేజర్ గన్ ద్వారా వాహన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సీసీ కెమెరాలు, బాడీవార్న్ కెమెరాల ద్వారా వీడియో రికార్డు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనం నడపడం, మోటారు వాహనాల చట్టం 185 ప్రకారం నేరమన్నారు. దానికి రూ.10వేలు జరిమానా లేక ఆరు నెలల శిక్ష ఉంటుందన్నారు.డ్రైవింగ్ లైసెన్సును 3 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు లేదా శాశ్వతంగా రద్దు చేస్తామన్నారు. నగరంలోని ఐటీఐ సర్కిల్‌లో గల రైల్వే ఓవర్ బ్రిడ్జి, గువ్వలచెరువు ఘాట్ రోడ్డు, రిమ్స్ రింగు రోడ్డు, మిగతా బైపాస్ రోడ్డు ద్వారా రాత్రి 10గంటల నుంచి ఉదయం 3 వరకు రాకపోకలు నిలిపేస్తామన్నారు. అలాగే మద్యం షాపులు కూడా ప్రభుత్వం అనుమతించిన సమయం వరకే తెరిచి ఉంచాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. అధిక వేగం, పబ్లిక్ ప్రదేశాల్లో రేసింగ్ నేరమన్నారు. వేడుకల పేరుతో మహిళల పట్ల ఇతర వాహనదారుల పట్ల అసభ్యకరంగా, అమర్యాదగా ప్రవర్తించరాదన్నారు. కొందరు వ్యక్తులు శుభాకాంక్షల పేరుతో ఈవ్‌టీజింగ్, స్నాచింగ్ చేసే అవకాశాలున్నందున మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్లపై కేక్‌లు కట్ చేసి ట్రాఫిక్ జామ్ చేసి పబ్లిక్‌కు ఇబ్బంది కలిగించరాదన్నారు. అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. రోడ్లపై ఉన్న బారికేడ్లు కానీ, డివైడర్లు కానీ, రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలను కానీ డ్యామేజ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.రోడ్లపై కానీ, జంక్షన్‌లలో కానీ టపాకాయలు పేల్చరాదన్నారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు నూతన సంవత్సరం సందర్భంగా ఎక్కడికిపోతున్నారు, ఎక్కడ తిరుగుతున్నారు, ఏం చేస్తున్నారన్న విషయాలపై తప్పనిసరిగా నిఘా పెట్టాలని సూచించారు.

నేటి రాత్రి నగరంలో పోలీసు ఆంక్షలు: సీఐ

డిసెంబరు 31న రాత్రి కడప నగరంలో పోలీసు ఆంక్షలు విధించినట్లు కడప వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. కోటిరెడ్డిసర్కిల్, సెవెన్‌రోడ్స్, క్రిష్ణాసర్కిల్‌లలో న్యూఇయర్ వేడుకలకు అనుమతి లేదన్నారు. ఈ వేడుకలు కుటుంబ సభ్యులతో ఇంట్లో సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగి బైకులు నడిపితే చర్యలు తప్పవన్నారు. రాత్రిళ్లు చిన్నపిల్లలను రోడ్లపై తిప్పరాదని, నిబంధనలు పాటించాలన్నారు.

ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్‌లను కొనసాగించండి



మంత్రికి సమస్యను వివరిస్తున్న రూటా ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ మీడియం సబ్జెక్టులు, లాంగ్వేజ్, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్‌లను యదావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలలోనే కొనసాగించాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా, ఆల్ మైనారిటీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఫరూక్ కోరారు. సోమవారం నంద్యాల పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రూటా రాష్ట్ర శాఖ, నంద్యాల జిల్లా శాఖ తరపున వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖాధికారులు హడావుడి నిర్ణయాలతో మైనర్ మీడియా ఉర్దూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఉర్దూ డీఐ హమ్మద్దీన్, రాష్ట్ర నాయకులు ముహమ్మద్ అయ్యూబ్, అబ్దుల్ హకీమ్, అఫ్జల్ బాషా, దస్తగీర్, జానీ బాషా, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం, ఆర్థిక సహాయ కార్యదర్శి ముహమ్మద్ హనీఫ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'మాకు ప్రాణరక్షణ కల్పించండి'

కడప మారుతీనగర్, డిసెంబరు30, (ఆంధ్రజ్యోతి): మా కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించి పుణ్యం కట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వికలాంగుల నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కోశాధికారి ముప్పాళ్ల వెంకటరామరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుడైన తాను అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలో నివసిస్తున్నామన్నారు. వారసత్వంగా తనకు ఆ గ్రామంలో కొంత స్థిరాస్థి వచ్చిందన్నారు. ఆ ఆస్థిని కాజేసేందుకు ఆ గ్రామానికే చెందిన కొందరు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దౌర్జన్యం చేస్తూ అక్రమ కేసులు బనాయించేందుకు పూనుకున్నారన్నారు. వారి ద్వారా తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, వారి బారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

బేడ బుడగజంగాలకు న్యాయం చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బేడ బుడగజంగం నాయకులు

కడప మారుతీనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):బేడ బుడగజంగాలకు ఎస్సీ కుల సర్టిఫికెట్లు జారీ చేసి న్యాయం చేయాలని బేడ బుడగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ధూపం రాజు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ చెరకూరి శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ కుల సర్టిఫికెట్ ఇవ్వని కారణంగా కడపకు చెందిన పాలిటెక్నిక్ చదివే గుర్రప్ప అనే విద్యార్థి మనస్థాపానికి గురై ఆత్మహత్యచేసుకున్నాడన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ జాతికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

'సంక్షేమ పథకాలపై స్పష్టత ఇవ్వాలి'

చెన్నూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని పీసీసీ సభ్యుడు పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెన్నూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ మాత్రం పెంచి ఇస్తున్నారు తప్ప మిగతా పథకాలన్నీ ఏమైనట్లన్నారు.

ప్రీమియం లిక్కర్ షాపునకు నేడు చివరి తేదీ

కడప(క్రైం), డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ప్రీమియం మద్యం దకాణానికి దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం చివరి తేదీ అని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు రూ.కోటి డిపాజిట్ చేయాలని, ప్రతి సంవత్సరం 10 శాతం పెరుగుతుందని తెలిపారు. మద్యం దుకాణం ఐదు సంవత్సారాలు ఉంటుందన్నారు.

నేడు మంత్రి మండిపల్లి రాక

కడప కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి డిసెంబరు 31వ తేదీన కడపకు రానున్నారని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడు మరణించిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని మంగళవార మధ్యాహ్నం 2 గంటలకు పరామర్శించనున్నారు. అనంతరం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబును పరామర్శిస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిరంతరం ఉత్సాహంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యువత నిరంతర ఉత్సాహంగా ఉండాలని వైవీయూ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు విశాఖ యువతకు ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలో సిద్దవటం, ఒంటిమిట్ట, పాత కడప వెంకటేశ్వరస్వామి ఆలయం, అమీన్‌పీర్ దర్గా, గండికోట తదితర చారిత్రక ప్రదేశాలు యువతకు గొప్ప అనుభూతి కలిగించాయన్నారు. జిల్లాలో ఇంకా ఎన్నో చారిత్రక ప్రదేశాలు, కళాఖండాలు విశేషంగా ఆకర్షిస్తాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

కమలాపురం చెరువులకు నీరు విడుదల

కొండాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ ద్వారా కమలాపురం చెరువులకు 200 క్యూసెక్కులు వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. పాపాఘ్ని నదిలోకి ఈ నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.8 టీఎంసీల నీరు ఉన్నాయన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

వేముల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి అన్నారు. సోమవారం మండల సమాఖ్య కార్యాలయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.

కమలాపురంలో నేడు పోలీసు యాక్టు అమలు: సీఐ



మాట్లాడుతున్న సీఐ రోషన్

కమలాపురం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కమలాపురం సర్కిల్ పరిధిలోని పరిధిలో ఈ నెల 31న 30 పోలీసుయాక్టు అమలులో ఉంటుందని సీఐ రోషన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం సర్కిల్ పరిధిలో అడిషనల్ ఎస్పీ, కడప సబ్ డివిజను డీఎస్పీ ఆదేశాల మేరకు 31న నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి సూచనలను జారీ చేసినట్లు తెలిపారు. డిసెంబరు 31న రాత్రి 10గంటల నుంచి ఉదయం 5 వరకు కమలాపురం, వల్లూరు పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో అన్ని ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కమలాపురం మండలపరిధిలో సంబటూరు బస్టాండు, కడప - కమలాపురం రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవరు బ్రిడ్జి నుంచి కమలాపురం అడ్డరోడ్డు వరకు, వల్లూరు మండలంలోని గణేశ్‌పురం నందు రాత్రి 10గంటల నుంచి ఉదయం 3గంటల వరకు పోలీసుల గస్తీ ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

నిబంధనల ప్రకారం నడుచుకోవాలి: సీఐ



కొత్తరోడ్డుపై వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

చెన్నూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : యువత నిబంధనల మేరకు నడుచుకోవాలని, 31న రాత్రి నుంచి జనవరి 1 ఉదయం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ పురుషోత్తంరాజు హెచ్చరించారు. సోమవారం స్థానిక కొత్తరోడ్డుపై వాహనాలు తనిఖీ చేసి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు నూతన సంవత్సర వేడుకలకు సంబంధించిన సూచనలను జారీ చేశామన్నారు. మండల పరిధిలో 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు.చెన్నూరు అన్ని ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తామన్నారు.

అనుమతి ఉన్న క్వారీల నుంచే ఇసుక తీసుకెళ్లాలి

ఇసుకను తరలించే ట్రాక్టర్ల యజమానులంతా అనుమతి ఉన్న క్వారీల నుంచే తీసుకెళ్లాలని నిబంధనలు మీరితే కేసులు నమోదు చేసి ట్రాక్టర్లు సీజ్ చేస్తామని సీఐ పురుషోత్తంరాజు హెచ్చరించారు. ఇసుకను ఏ అవసరాలకు తీసుకువెళుతున్నారో అందుకు సంబంధించిన లేఖను తహసీల్దారు లేదా సచివాలయ కార్యదర్శుల నుంచి తప్పక తీసుకోవాలన్నారు.

పచ్చదనంతో ఆరోగ్యకర వాతావరణం

పులివెందుల రూరల్, డిసెంబరు 30: పచ్చదనంతో ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుందని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక జాతీయ సమాచార కార్యదర్శి పి.సనావుల్లా ఆధ్వర్యంలో పచ్చదనతో పలకరింపు - గ్రీట్ విత్ గ్రీన్ అనే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నూతన సంవత్సరానికి సంబంధించి బొకేలు, గ్రీటింగ్‌లు, స్వీట్ల వల్ల ఎటువంటి లాభం చేకూరదన్నారు.

అదే ఒక మొక్క పెరిగేకొద్దీ మంచి వాతావరణం ఇస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఒక మొక్క ఇచ్చి నూతన సంవత్సరానికి శుభాకాంక్షలు తెలుపుకోవాలని కోరారు.

అలిరెడ్డిపల్లె హైలెవెల్ వంతెనను పరిశీలించిన పీఆర్ ఈఎన్‌సీ



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్ తదితరులు

వేంపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం సమీపంలోని పాపాఘ్ని నదిలో అలిరెడ్డిపల్లెకు వెళ్లే మార్గంలో నిర్మించిన హైలెవెల్‌బ్రిడ్జిని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలునాయక్ సోమవారం పరిశీలించారు. పీఎంజీఎస్‌వై పథకం కింద రూ.32 కోట్లకు పైగా వ్యయంతో బ్రిడ్జి నిర్మించారు. రాకపోకలు జరుగుతున్నాయి. ఆ బ్రిడ్జిని ఈఎన్‌సీ పరిశీలించి ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి, ఈఈలు శ్యామ్‌సుందర్‌రాజు, రామచంద్రనాయక్, డీఈ సుధాకర్‌రెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి'

వేంపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమిత్‌షాను విమర్శిస్తూ ఇతర పార్టీలతో కలిసి నిరసన తెలిపిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామాంజనేయులు పై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్ అధికారులను కోరారు. ఎంఈఓ జాఫర్ సాదిక్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. అంబేద్కర్‌ను బీజేపీ ఎంతో గౌరవించిందని, రాజ్యాంగం పట్ల గౌరవంతోనే పరిపాలన చేస్తోందని గుర్తుచేశారు. బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, సుష్మ, దొంతుసుమన్, సునీల్, శివకుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐపై విచారణ ?

కడప(క్రైం), డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో పనిచేసిన ఎక్సైజ్ సీఐపై ఆశాఖ ఉన్నాతాధికారులు సోమవారం విచారించినట్లు తెలుస్తోంది. కడపకు చెందిన వ్యక్తి వద్ద నుంచి దాదాపుగా రూ.లక్షల్లో నగదు తీసుకుని తిరిగి ఇవ్వలేదు. దీంతో అతడు ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, హోం మినిస్టర్ అనిత, మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. వారి అదేశాల మేరకు కడప ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆధ్వర్యంలో విచారించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ సీఐ మంగళగిరిలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డికి సన్మానం



గోవర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ నజీముద్దీన్, మాజీ కార్పొరేటర్ జకీరుద్దీన్

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత 11 సంవత్సరాల నుంచి ప్రతి సోమవారం కలెక్టరేట్ ఎదుట ఉచితంగా భోజనం అందిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డికి టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్, మాజీ కార్పొరేటర్ జకీరుద్దీన్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి అక్బర్ అయన్ను సత్కరించారు. సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

రాజశ్రీ కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు యందు

O.S. No. 281/2016

కంభం వరప్రసాద్‌రెడ్డి తండ్రి కె.వి.నారాయణరెడ్డి, 42 సం.రాలు, హిందూ, వ్యాపారం, R/o డి.నెం. 28/810-బి-1, ఎన్.జి.ఒ. కాలనీ, నంద్యాల టౌన్, కర్నూలు జిల్లా. - వాది

V/s

1) లేటు శ్రీనివాసరెడ్డి having died his LRs. [illegible] C/o Managing Director, H2U Water Care India Pvt. Ltd., [illegible] Balaji Complex, S.G. Palya Thavarekere, Main Road, Bangalore-560029, Karnataka State. [illegible] హిందూ, DE Shaw and Co., Flat No. 573, 6 and C Road No.1, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. - ప్రతివాదులు

నోటీసు

[illegible] 09-01-2025న [illegible] ఉ. 10.30 గంటలకు [illegible]

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

జి. నాగేశ్వరరావు, అడ్వకేట్ & నోటరీ, కడప.

రైతుల కోసమే ఈ- రెవెన్యూ సదస్సు

వల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసమే ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దారు శ్రీవాణి అన్నారు. సోమవారం లేబాక గ్రామ సచివాలయం వద్ద ఈ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అర్జీలతో పాటు రైతులు తగు ధ్రువీకరణ పత్రాలు ఇస్తే అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తాము అందుబాటులో ఉంటామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు సుబ్బారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల

పులివెందుల టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని పులివెందుల ఆర్డీవో చిన్నయ్య అన్నారు. సోమవారం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పోటీ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరీక్ష కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు.

యూటీఎఫ్ సేవలు ప్రశంసనీయం : డీఈఓ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ లోకానికి యూటీఎఫ్ సేవలు ప్రశంసనీయమని జిల్లా విద్యాశాఖ అధికారిణి యు.మీనాక్షి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కడపలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను జిల్లా విద్యాశాఖ అధికారి ఆవిష్కరించారు.యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులలు డి.కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, శ్రీకాంత్, సురేష్‌కుమార్, వీరనారాయణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప నాగరాజుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్థానిక సాయిరామ్ జూనియర్ కళాశాలలో సోమవారం రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యు) 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ కొత్త సంవత్సరం విద్యార్థులకు అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, సంతోష్, ప్రమోద్, శ్యామ్, వెంకటరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు మేలు చేస్తాం

వేంపల్లె, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు టీడీపీ ప్రభుత్వం మేలు చేస్తుందని ఆ పార్టీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల క్యాలెండర్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, భవన నిర్మాణకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ యాజమాన్యంపై రైతుల ఫిర్యాదు

జమ్మలమడుగు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం మైలవరం మండలం బూబూసానిపల్లె, దొడియం, గ్రామాల రైతులు ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ దొడియం గ్రామ పొలంలో సర్వేనంబరు 1-60-1లో 2.53 ఎకరాలు వ్యవసాయ భూమి ఉందన్నారు. ఈపొలానికి వెళ్లే దారి పూర్వం నుంచి ఉందన్నారు. గ్రామంలో పొలానికి దగ్గరలో గ్రావెల్ రోడ్డు వేసి దన్నవాడ, నక్కవానిపల్లె గ్రామాల ప్రజల రాకపోకలకు ఏర్పాటు చేసిన రోడ్డు నుంచి వ్యవసాయానికి వెళ్లే రైతులకు వెళ్లే దారి లేకుండా ముళ్ల కంచె వేశారన్నారు. రైతులకు సోలార్ యాజమాన్యం అక్కడ పనిచేస్తున్న అధికారులు ఇబ్బంది కలిగించడం దారుణమని ఆర్డీవో సాయిశ్రీకి ఫిర్యాదు చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలుతీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. తమ పొలాలు సోలార్‌కు తీసుకోకపోయినా వ్యవసాయం చేసుకుని జీవించే రైతుల పొలాలకు ముళ్ల కంచె ఏర్పాటు చేయడం ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేసులు నమోదు చేయాలని రైతులు కోరారు. వెంటనే ఆర్డీవో సాయిశ్రీ రైతులకు తగిన న్యాయం చేస్తామని తెలిపినట్లు వారు తెలిపారు.

టౌన్ బ్యాంక్ సేవలు మరింత విస్తృతం కావాలి



ప్రొద్దుటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సేవలు మరింత విస్తృతం చేసి లాభాల బాటలో పయనించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ 2025 నూతన కేలండర్‌ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మెన్ బొగ్గుల సుబ్బారెడ్డి, బ్యాంకు సీఈవో నిరంజన్ రెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్, డైరీ ఆవిష్కరణ

కలసపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :కలసపాడు ఎంఈవో కార్యాలయంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2025-26 నూతన విద్యాసంవత్సరపు కేలండర్, డైరీని ఎంఈవో ఎస్.మస్తాన్‌వలి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి ఈరి బాలజోజి, మండల అధ్యక్షుడు జి.బాల ఓబయ్య, సుమనయ్య, సురేశ్, రవికుమార్, కేవీ సుబ్బారెడ్డి, ఎస్.గురయ్య, వెంకటసుబ్బయ్య, బి.ప్రభాకర్, మహబూబ్‌హుస్సేన్, రమేశ్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ముందంజలో ఉంటుందని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు రమణారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్టీయూ భవనంలో నూతన కేలండరును ఆవిష్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, వైద్యులు రమణారెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

అనుమతి లేని ఎరువులను విక్రయించరాదు

పోరుమామిళ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేని ఎరువులను విక్రయించరాదని పోరుమామిళ్ల ఏవో వరహరికుమార్ అన్నారు. సోమవారం బద్వేలు, పోరుమామిళ్ల మండల వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎఫ్‌సీవో 1983 యాక్టు అనుసరించి ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలన్నారు.

న్యూఇయర్ వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రొద్దుటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : 2025 నూతన ఆంగ్ల సంవత్సర వేడుకల్లో పట్టణంలో ప్రజలు పోలీసుల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 31 రాత్రి 9గంటలనుంచి ప్రొద్దుటూరు పట్టణంలో ఆంక్షలు అమలు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం, తాగి బైక్‌లు నడపడం, సైలెన్సర్ లు తీసి బైక్‌లను రోడ్డు మీద తిప్పుతూ హంగామా చేయడం లాంటివి చేస్తే వెంటనే అదుపులోకి తీసుకుంటామన్నారు. రాత్రి 10 గంటల తరువాత పోలీసులు వాహనాలు తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు బ్రీత్ అనలైజర్ ద్వారా టెస్టు చేస్తామన్నారు. వాహనాలు అతివేగంగా నడిపినా సీజ్ చేస్తామన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచిస్తున్నామన్నారు. న్యూఇయర్ వేడుకలకు బహిరంగంగా జరుపుకునేందుకు ఇండోర్‌లో జరుపుకునేందుకు గానీ పోలీసుల పర్మిషన్ తీసుకోవాలన్నారు. డీజే సిస్టమ్స్ పెట్టరాదన్నారు. హోర్డింగ్‌లు, పోస్టర్లు అశ్లీల నృత్యాలు, సినిమాలు, అశ్లీల సంజ్ఞలు చేయరాదన్నారు. ఆడవారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వైన్ షాపులు, రెస్టారెంట్‌లు రాత్రి 10 తరువాత మూసి వేయాలన్నారు. పట్టణంలో డిసెంబరు 31 రాత్రి ఎలాంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామన్నారు.



ప్రొద్దుటూరు.. మాట్లాడుతున్న డీఎస్పీ భక్తవత్సలం

కొండాపురం..: మండలంలో న్యూఇయర్ సందర్భంగా ఆంక్షలు విధించినట్లు కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. డిసెంబర్ 31, మంగళవారం రాత్రి 9 గంటల నుంచి ఎవరూ రోడ్లపై ఉండరాదన్నారు. మద్యం తాగి వాహనాలతో రోడ్లపై రాకూడదన్నారు. రోడ్లపై ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండకూడవద్దన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడవద్దని, డీజేలకు అనుమతిలేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ, ఎస్ఐలు హెచ్చరించారు.

పోరుమామిళ్ల..: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకల్లో శృతిమించితే కఠిన చర్యలు తప్పవని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వేడుకలు ముఖ్యంగా ఈ నెల 31నరాత్రి పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో పోలీసుల ఆంక్షలు కఠినంగా ఉంటాయన్నారు. న్యూఇయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని, 31న రాత్రి 9గంల నుంచి పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో ఆంక్షలు అమలులో ఉన్నాయన్నారు. బహిరంగప్రదేశాల్లో మద్యం తాగడం, సైలెన్సర్లు తీసివేసి బైకులు నడపరాదన్నారు.డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు రాత్రి 9 నుంచి నిర్వహిస్తామన్నారు. నగరంలోని బైకు రైడర్స్‌ను అదుపులోకి తీసుకునేందుకు పలు సర్కిళ్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

బద్వేలుటౌన్..: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకొని పోలీసు ఆంక్షలను పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అర్బన్‌సీఐ రాజగోపాల్ అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూడళ్లవద్ద, రోడ్లపై కేక్‌కట్ చేయడం, బాణాసంచాలు పేల్చడం నిషిద్ధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. రాత్రివేళ్లల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడం, ప్రత్యేక పోలీసుబృందాలను ఏర్పాటు చేయడం వంటి అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నామన్నారు.

మంత్రి రాకతో అధికారుల్లో కదలిక

● పడకేసిన పారిశుధ్యాన్ని పరిశీలించిన అధికారులు

జమ్మలమడుగు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని మోరగుడి గ్రామం మేజర్ పంచాయతీ. ఇక్కడ కొన్ని నెలలుగా గ్రామంలోకానీ, రోడ్డుకు ఇరువైపుల పారిశుధ్యం, వ్యర్థాలు పడకేశాయి. డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నిండి కంపుకొడుతున్నాయి. ఈ సమస్యను రెండు నుంచి 3 నెలల క్రితం స్థానిక అధికారులకు ప్రజలు సమస్యను తెలియజేసినట్లుగా తెలిపారు. అయితే ఏ ఒక్క అధికారి ఆ రోడ్డులో తిరుగుతున్నా స్పందించలేదని గ్రామస్థుల వాదన.

● మంత్రి రాకతో అధికారుల్లో కదలిక

మోరగుడి మేజర్ పంచాయతీలో సోమవారం సాయంత్రం పంచాయతీ అధికారుల్లో కదలిక వచ్చింది. రోడ్డుకు ఇరువైపుల పడకేసిన పారిశుధ్యాన్ని పరిశీలించారు. జనవరి రెండో తేదీ కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ మోరగుడి గ్రామాన్ని మొదట సందర్శించి అక్కడ నుంచి గండికోట గ్రామానికి వెళతారని పర్యటన ఖరారు అయినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. దీంతో ఉన్నట్లుండి గ్రామ పంచాయతీ అధికారులతోపాటు ఉన్నతస్థాయి అధికారులు మోరగుడి గ్రామంలో పరిశీలన కార్యక్రమం ప్రారంభమైంది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఎవరు వస్తున్నారని అడగడం ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా అధికారులు చెత్తాచెదారాన్ని పరిశీలించి త్వర త్వరగా పనులు పూర్తిచేయాలని కూలీలకు చెప్పడంతో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నుంచి వ్యర్థాలను తొలగించడం ప్రారంభమైంది. అక్కడ కూలీలతో ఒకరిద్దరు మహిళలు వచ్చి మంత్రి వస్తున్నారని వ్యర్థాలన్నీ తొలగించడం రోడ్డువరకేనా, గ్రామంలో కూడా శుభ్రత చేయాలని అనేకచోట్ల చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని ఆవేదనతో తెలియజేశారు. ఏది ఏమైనా మోరగుడి గ్రామంలో మంత్రి రాకతో పడకేసిన పారిశుధ్యానికి కదలిక వచ్చిందని గ్రామస్థులు చెప్పుకోవడం విశేషం.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు, వ్యర్థాలను ట్రాక్టర్‌లోకి నింపుతున్న కూలీలు

ప్రజల సమస్యలు పరిష్కరించండి: పుట్టా

ఖాజీపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలకు వచ్చే ప్రజలను గౌరవించి వారి సమస్యలు పరిష్కరించే విధంగా పని చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం పుల్లూరు పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కాగా రహ్మత్‌ఖాన్‌పల్లెకు చెందిన నంద్యాల బాలరాజు కుమారుడు సురేంద్ర యాదవ్,వెంకటసురేఖ రిసెప్షన్‌లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన వెంకటయ్య, పైరెడ్డి తిరుపతిరెడ్డి వారం క్రితం మృతి చెందారు. సోమవారంవారి కుటుంబాలను పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, భూమాయపల్లె సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, బుచ్చిరెడ్డి, నాగశివారెడ్డి, జానకిరాం, వెంకట్రామిరెడ్డి, హరినాధరెడ్డి, పుల్లయ్యనాయుడు, శంకర్‌రెడ్డి, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

● **టీ కొట్టులో టీ తాగిన పుట్టా..:** కడప - కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురవాయపల్లె వద్ద గల ఖదీరియా టీస్టాల్‌లో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా టీ తాగి కార్యకర్త యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సంజీవని హాస్పిటల్ తనిఖీ

బద్వేలుటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిద్దవటంరోడ్‌లో ఉన్న సంజీవని హాస్పిటల్‌పై అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సోమవారం అడిషినల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ సంజీవని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పరిసరాలు, పరికరాలు, అనుమతులు ఇలాంటివాటిపై సమగ్రంగా విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లోపాలు స్పష్టంగా కన్పిస్తున్నాయన్నారు. రెండు రోజులు పరిశీలించి నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. సంజీవని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి తనిఖీకి వచ్చాక కొంత మంది చాలా ఆరోపణలు చేశారన్నారు. వాటన్నింటినీ స్టేటమెంట్ రూపంలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామన్నారు.

కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని సీపీయం మండల కార్యదర్శి భైరవప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గౌసియాబేగం, సుందరయ్య, రవి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రివర్గ ం నుంచి తొలగించాలని సోమవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఐదురోడ్ల కూడలిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్, సీపీఎం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



రాయల్ సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్,డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపాలిటీలో బ్యూటిఫికేషన్ కోసం చేస్తున్న పనులను సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పరిశీలించారు. మొదటగా రిజిస్టర్ ఆఫీసు, ప్రభుత్వ భవనం మార్పులో భాగంగా నిర్మిస్తున్న భవనాలను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రొద్దుటూరు రోడ్డులోని బటర్‌పై లైట్లు,రాయల్ సర్కిల్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం పనులను,కడప రోడ్డులోని ఎన్‌టీఆర్ కొత్త విగ్రహం పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,. ధనపాల జగన్,మాజీ సర్పంచ్ బీఎన్ శ్రీనివాసులు, రవీంద్ర,రాధాక్రిష్ణ,ఆకుల క్రిష్ణయ్య,బండి అమర్‌నాథ్, యుగంధర్,ధనపాల రవి,తుపాకుల రమణ,కమిషనర్ శ్రీనివాసులురెడ్డి,ఏఈలు తదితరులు పాల్గొన్నారు.కాగా మైదుకూరు నియోజకవర్గంలో 22 కుటుంబాలకు సుమారు 27 లక్షల రూపాయల నిధుల చెక్కులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సోమవారం పంపిణీ చేశారు.

డైవర్షన్ రోడ్డుపై ఎమ్మెల్యే సీరియస్..: మైదుకూరు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళుతుండగా విశ్వనాధపురం వద్ద జరుగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా డైవర్షన్ రోడ్డు పనితీరుపై సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ రోడ్డు అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.కొత్తగా వేసిన రోడ్డు అప్పుడే రాళ్లు తేలి,దుమ్ము విపరీతంగా ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీపీఎం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్ విడుదల

కాశినాయన డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): జనవరి 4,5 తేదీల్లో కడపలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్,మండల కన్వీనర్ పోలయ్య పేర్కొన్నారు. సోమవారం ఆకులనారాయణపల్లె గ్రామంలో సీపీఎం 12వ మహాసభల గోడపత్రాలను వారు విడుదల చేశారు. ఈకార్యక్రమంలో పలువురు ఆపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్‌షాపు డీలర్లకు దరఖాస్తు చేసుకోండి

అట్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని శాశ్వత డీలర్లుగా ఖాళీలున్న అట్లూరు, వరికుంట, రెడ్డిపల్లె, ఎర్రబల్లె, ఉప్పుటూరు, చెండువాయి, మాడపూరు, కమలకూరు గ్రామాల చౌక దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దారు సుబ్బలక్షుమ్మ సోమవారం డీలర్ల సమావేశంలో తెలిపారు. ఈ నెల 6వతేదీలోగా తహసీల్దారు కార్యాలయానికి దరఖాస్తు తీసుకోవాలని, 11వతేదీన బద్వేలు ఆర్డీవో కార్యాలయంలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ పాసై ఉండాలని, ఆయా రేషన్‌షాపుల రిజర్వేషన్లను బట్టి దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలోఆర్ఐ రమణ, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రితేష్‌రెడ్డి

బద్వేలు, రూరల్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలపరిధిలోని తిరువేంగళాపురం గ్రామంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత బొజ్జ రోశన్న, తహసీల్దార్ ఉదయభాస్కరరాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, ఎల్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు భూమిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, బిజివేముల చంద్రశేఖర్‌రెడ్డి, తొలిచర్ల వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రీసర్వేతో నష్టపోయిన ప్రతి రైతు సమస్యలను పరిష్కరించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినదే గ్రామ రెవెన్యూ సదస్సులని బద్వేలు ఇన్‌ఛార్జ్ రితీశ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మధునాయక్, మండల సర్వేయరు రక్షిత, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎల్ఎస్‌పీ డైరెక్టరు వెంకటరమణారెడ్డి, గోడి రమణారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'బలిజ సంఘం అభివృద్ధికి కృషి చేయాలి'

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణదేవరాయల బలిజ, కాపు, తెలగ అన్నదాన సంఘం అభివృద్ధికి కమిటీ సభ్యులందరూ కృషి చేయాలని అధ్యక్షుడు గోశెట్టి పిల్లనారాయణగారి శ్రీరాములు తెలిపారు. సోమవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో కల్యాణమండపంలో నూతన సంవత్సరం 2025 కేలండరును కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బొల్లు రామ్మోహన్, కోశాధికారి ఆకుల కొండయ్య, ఉప కోశాధికారి శీలం సింగయ్యగారి రామ్మోహన్, ఉపాధ్యక్షుడు ఓబులేసు, సిగినేని రమణయ్య, ధర్మిశెట్టి రమణయ్య, గురయ్య, కోనేటి సుబ్బరాయుడు, సింగంశెట్టి గుమ్మటయ్య, పీవీఎస్ మూర్తి, కమిటీ సభ్యులు, సంఘం నేతలు పాల్గొన్నారు.

కుల గణనపై అభ్యంతరాలు చెప్పండి

పోరుమామిళ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం నిర్వహించిన క్యాస్ట్ సర్వేపై ఎస్సీ సామాజిక వర్గీయులు ఎవరైనా అభ్యంతరాలు ఉంటే ఆయా సచివాలయాల్లో పంచాయతీ కార్య దర్శులకు, వీఆర్వోలకు తెలుపవచ్చని ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులాల జాబితాలను ఇప్పటికే ఆయా సచివాలయాల్లో ప్రదర్శించారని, అందుకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా సచివాలయ సిబ్బందిపై దృష్టికి తీసుకువని వస్తే సరిచేస్తామన్నారు. కులంతో పాటు ఇతర వివరాలు కూడా పరిశీలించుకోవచ్చన్నారు. సచివాలయ సిబ్బంది సైతం గ్రామాల్లోని ఆయా వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేసి విషయం ప్రజలకు తెలియజేయాలన్నారు. అభ్యంతరాలను మంగళవారం సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు.

ఉచితంగా లైవ్‌సర్టిఫికెట్లను పొందండి

బద్వేలు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాలుగురోడ్ల కూడలి సమీపంలో ఉన్న పెన్షనర్స్ కార్యాలయంలో జనవరి 2 నుంచి ఉచితంగా నిర్వహించబోయే లైవ్‌సర్టిఫికెట్లను దరఖాస్తు చేసుకొని పెన్షనర్స్ ఉచితంగా పొందాలని పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్ తమకు సంబంధించిన ఆధార్‌కార్డులు, ఇతర ధృవీకరణ పత్రాలను వెంటతెచ్చుకోవాలని ఆయన కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతోనే సృజనాత్మకత

ఎర్రగుంట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయ ని ఎంఈవోలు శివప్రసాద్, రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎర్రగుంట్ల మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. 5 జడ్పీ హైస్కూల్స్ నుంచి 46 ప్రాజెక్టులు వ్యక్తిగత, గ్రూపు, టీచర్ విభాగాల్లో పాల్గొన్నారు. ప్రదర్శనలో మూడు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి వారికి బహుమతులు పంపిణీ చేశారు. వ్యక్తిగత విభాగంలో వై.శ్రీవాసవి చిలమకూరు, సామూహిక విభాగంలో పోట్లదుర్తి విద్యార్థిని పి.వాణిలక్ష్మి, టి.ధరణి పంచుకున్నారు. టీచర్ విభాగంలో ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన బాలక్రిష్ణ గెలుచుకున్నారు. అధికారులు బహుమతులను అందజేశారు.

మైదుకూరు రూరల్..: జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు మైదుకూరు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల సోమవారం ఎంఈవో పద్మలత విద్యార్థులను అభినందించారు.మైదుకూరు కస్తూరిబా పాఠశాల నుంచి అగ్రికల్చర్ మోటర్ కంట్రోల్ ప్రాజెక్టను తయారు చేసిన నిహారిక,ఆల్కాహాల్ సెన్సింగ్ అలర్ట్ ఇంజెన్ ప్రాజెక్ట్ నమూనను తయారు చేసిన నాగభూవేశ్,బాబు సందీప్,ఉపాధ్యాయ విభాగంలో చంద్రయాన్ ప్రాజెక్ట్ నమూనాను తయారు చేసిన సురేంద్ర నాయక్ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు ఎంఈవో పద్మలత తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ రామ్మోహన్ ,నరహరిశర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు

నేటి ఉదయం నుంచే పెన్షన్ల పంపిణీ

కొండాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఒక్కరోజు ముందుగానే సామాజిక పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది పెన్షన్లను పంపిణీ చేస్తారన్నారు.